క్లుప్తంగా

పేదలకు చీరల పంపిణీ


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పేదలకు సాయం చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు అండిబోయిన అప్పారావు దంపతుల పెళ్లి రోజు వేడుకలను వుడా కాలనీ వినాయకనగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, వెంపాడ అప్పారావు, ఎల్లేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తికి సహకరించండి

కేంద్ర ఉక్కు కార్యదర్శికి ఇంటక్ వినతి


కేంద్ర ఉక్కు కార్యదర్శి సిన్హాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి ఉత్పత్తికి ఉక్కు మంత్రిత్వశాఖ సహకరించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు కేంద ఉక్కు కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హాను కోరారు. స్టీల్‌ప్లాంట్ పర్యటనకు విచ్చేసిన కేంద్ర కార్యదర్శిని ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు ఆదివారం హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు అందరూ పూర్తి స్థాయి ఉత్పత్తి తీయడం ద్వారా ప్రభుత్వానికి, యాజమాన్యానికి సహకరించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్, రా మెటీరియల్‌ను అత్యవసరంగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముడి పదార్థాల కొరత తీరడానికి ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. సెయిల్ మాదిరిగా వేతన ఒప్పందం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, డి.వుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

తరలిన విద్యార్థులు.. వర్సిటీ నిర్మానుష్యం


నిర్మానుష్యంగా ఏయూ పరిపాలన భవనానికి వెళ్లే మార్గం

ఏయూ క్యాంపస్: ఓటు వేసేందుకు విద్యార్థులు తమ స్వగ్రామాలకు తరలిపోవడంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం బోసిపోయింది. వర్సిటీ రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నార్త్ క్యాంపస్‌ను పూర్తిగా ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు వినియోగిస్తున్నారు. సౌత్ క్యాంపస్ మాత్రం విద్యార్థులు లేక బోసిపోయింది. దీనికి తోడు రెండో శనివారం, ఆదివారం కలసి రావడంతో వర్సిటీ మొత్తం ఖాళీ అయిపోయింది. వర్సిటీ ఉద్యోగులు సైతం ఎన్నికల విధులకు వెళ్లిపోయారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

దాబాగార్డెన్స్ : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భారత్ వికాస్ పరిషత్ జాతీయ స్థాయి ఉపాధ్యక్షుడు రమేష్‌చంద్ జైన్ సూచించారు. వన్‌టౌన్ ఏరియా గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న బాల బాలికల మనోవికాస వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. గీతా ప్రచార సమితి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. అనంతరం ప్రముఖుల చేతుల మీదుగా వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న వారందరికీ ప్రశంసా పత్రాలు, విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు పి. జగనమోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి పాల్గొన్నారు.

పోలింగ్‌కు వేళాయె..

- 306 పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు
- ఆయా కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, మెటీరియల్
- ముందుగానే చేరుకున్న సిబ్బంది

మొత్తం ఓటర్లు	3,33,611
పురుషులు	1,67,112
మహిళలు	1,66,487
ఇతరులు	12
పోలింగ్ కేంద్రాలు	306


గాజువాక హైస్కూల్లో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

గాజువాక : గాజువాకలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల నిర్వహణ సిబ్బంది ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి అవసరమైన ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, కంట్రోల్ యూనిట్లు, ప్రిసైడింగ్ అధికారుల నిబంధనావళి, మెటీరియల్ కిట్లు, ఓటర్ల రిఫరల్ ఇమేజ్ షీట్లు, ఓటర్ల జాబితా, బ్యాలెట్ పేపర్లు తదితర వస్తువులను సిబ్బందికి అందజేశారు. నియోజకవర్గంలో 3,33,611 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వారిలో పురుషులు 1,67,112 మంది కాగా, మహిళలు 1,66,487 మంది. ఇతరులు 12 మంది. వీరికోసం నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల పరిశీలకులతో పాటు మైక్రో అబ్జర్వర్లు, వంద పోలింగ్ కేంద్రాలకు అదనపు పీవోలు, సెక్టార్ ఆఫీసర్లను నియమించారు.

83 సమస్యాత్మక కేంద్రాలు

306 పోలింగ్ కేంద్రాలున్న నియోజకవర్గంలో 83 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. వాటివద్ద అదనపు పోలీసు బలగాలతో పాటు సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ కూడా బందోబస్తు నిర్వహిస్తాయి.

- ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు సిబ్బందిని కేటాయించారు. ఒక పోలింగ్ అధికారి, ముగ్గురు ఏపీవోలు, ఒక పీవో, సహాయకుడు సేవలు అందిస్తారు.
- ఒకేసారి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండటంతో ప్రతీ పోలింగ్ కేంద్రంలో రెండు సెట్ల ఈవీఎంలు ఉంచుతారు. పోలింగ్ స్టేషన్‌లో ఓటర్ల రాకపోకల కోసం విడివిడిగా ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు.
- ప్రతీ పోలింగ్ కేంద్రంలో రెండు ఓటింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఒకటి లోక్‌సభ ఎన్నికల బ్యాలెట్ యూనిట్ల కోసం, మరొకటి అసెంబ్లీ ఎన్నికల బ్యాలెట్ యూనిట్ల కోసం ఉంచుతారు.
- ప్రతి ఓటింగ్ బూత్‌పైన అసెంబ్లీ, లోక్ సభ అనే పేర్లతో లేబుళ్లను అతికిస్తారు.

బరిలో 14 మంది అభ్యర్థులు

గాజువాక నియోజకవర్గంలో 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జాతీయ, ప్రాంతీయ పార్టీలుగా గుర్తింపు పొందిన పార్టీల నుంచి గుడివాడ అమర్‌నాథ్ (వైఎస్సార్‌సీపీ), పల్లా శ్రీనివాసరావు (టీడీపీ), మరడాన జగ్గునాయుడు (సీపీఎం) అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వారితోపాటు వివిధ పార్టీల నుంచి ఎనిమిది మంది రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులుగా, మరో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు.

పెదగంట్యాడ మండలంలో 75 కేంద్రాల్లో..

పెదగంట్యాడ: మండలంలోని మొత్తం 75 కేంద్రాల్లో పోలింగ్‌కు అవసరమైన సరంజామాను ఆయా కేంద్రాలకు తరలించారు. అటు యారాడ నుంచి ఇటు నడుపూరు, గొడ్డువానిపాలెం, గంగవరం, దయాల్‌నగర్, వుడా కాలనీ వినాయకనగర్, సమతానగర్, వియ్యపువానిపాలెం, టీజీఆర్ నగర్, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, సీతానగరం, నెల్లిముక్కు, సిద్ధేశ్వరం, అయ్యన్నపాలెం, వికాస్‌నగర్, పిట్టవానిపాలెం, అప్పికొండ, పాలవలస తదితర ప్రాంతాల్లోని కేంద్రాలను సిద్ధం చేశారు. ఓటర్లు వచ్చి ప్రశాంతంగా ఓటు వేసేందుకు అవసరమైన చర్యలను అన్ని కేంద్రాల్లో చేపట్టారు. ఆయా కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఈవీఎంలు, ఓటర్ల జాబితా తదితర సామగ్రిని వెంట తీసుకువచ్చారు. ఇప్పటికే మండలంలో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకూ ఎవరూ ఉండకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. రాజకీయ పార్టీలకు చెందిన వారు కూడా పోలింగ్ కేంద్రాలకు దూరంగా ఉండాలని, పార్టీ జెండాలు, కండువాలు లేకుండా ఉండాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ఎంపీపీ స్కూల్స్‌లో పోలింగ్ నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. గాజువాక సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రం పక్కనే ఉన్న నివాసితులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రం నుంచి 200 మీటర్ల దూరంలో ఎవరూ ఉండకూడదని, గుంపులుగా కూడి నిలబడవద్దని, ఓటరు ఓటు వేసేందుకు వచ్చేటపుడు నిబంధనలు పాటించాలని తెలిపారు.


గాజువాక హైస్కూల్లో పోలింగ్ కేంద్రం బయట ఏర్పాట్లు



నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాల వద్ద..


బీఎల్‌వోలు, పోలింగ్ ఏజెంట్లకు సూచనలిస్తున్న అధికారులు


అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద వివరాలు సేకరిస్తున్న గాజువాక సీఐ శ్రీనివాసరావు


గాజువాకలోని ఓ పోలింగ్ కేంద్రంలో బూత్


మింది హైస్కూల్‌లో పోలింగ్ బూత్


కూర్మన్నపాలెంలోని స్కూల్‌లో పోలింగ్ బూత్


నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాలలో పోలింగ్ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్ధమైన ఏవీఎంలు

వైభవంగా త్యాగరాజ స్వామి జయంత్యుత్సవం


శ్రీరామగానామృతం బృంద గానం

మద్దిలపాలెం : త్యాగరాజ స్వామి జయంత్యుత్సవాలను మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఐవీఎస్ శాస్త్రీ సంగీత సమితీ ఆధ్వర్యంలో ఆకొండి వెంకటరావు శిష్య బృందం ఆలపించిన శ్రీరామ గానామృతం హృద్యంగా సాగింది. ఈ వేడుకలను త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణరాజు, రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి వినోక్షానంద మహారాజ్ ప్రారంభించారు. అనంతరం ఆకొండి వెంకటరావు రూపకల్పన చేసిన భజనమంజరి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ముగిసిన తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం విశిష్టాద్వైత స్థాపకులు భగవత్ రామానుజాచార్యుల జయంతిని వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని హంసమూలన వరాహలక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవితో పాటు రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని అధిష్టంపజేసి షోడశోపచార పూజలు చేశారు. తిరువీధి నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రోజులుగా నిర్వహించిన తిరునక్షత్రం పూజలు ఘనంగా ముగిశాయి.

ఓటింగ్ శాతం పెరుగుతుందా..!

గాజువాక : నియోజకవర్గంలో ఈసారి పోలింగ్ ఎంత శాతం నమోదు కానుందనే విషయంపై రాజకీయ పరిశీలకులు ఆసక్తి కనబర్చుతున్నారు. ఓటింగ్ పెరిగితే ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే అంశంపై రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. ఇక్కడ గుర్తింపు పొందిన పార్టీల నుంచి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలవగా, గుర్తింపు పొందని పార్టీల నుంచి ఎనిమిది మంది, స్వతంత్ర అభ్యర్థులు ముగ్గురు బరిలో నిలిచారు.

మొత్తం 14 మంది బరిలో ఉన్న ఈ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే గట్టి పోటీ ఉంటుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. మరోపక్క తమ ఉనికిని చాటుకోవడం కోసం ఇండియా కూటమి తరఫున పోటీలో ఉన్న సీపీఎం గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

గతంలో ఓటింగ్ ఇలా..

- 2009లో గాజువాక నియోజకవర్గానికి తొలిసారిగా ఎన్నికలు జరిగినప్పుడు 2,20,709 మంది ఓటర్లున్నారు. అప్పట్లో చతుర్ముఖ పోటీ నెలకొనడంతో 68 శాతం ఓటింగ్ నమోదైంది.
- 2014 ఎన్నికల నాటికి గాజువాక ఓటర్ల సంఖ్య 2,89,939 మందికి పెరిగింది. ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికీ ఆ ఎన్నికల్లో ద్విముఖ పోటీ నెలకొనడంతో ఓటింగ్ శాతం 64.64 వద్ద నిలిచిపోయింది. బరిలో ప్రధాన అభ్యర్థులు ఇద్దరే కావడంతో ఈ శాతం తగ్గిపోయినట్టు అప్పట్లో పరిశీలకులు అంచనా వేశారు.
- 2019 ఎన్నికల్లో మళ్లీ త్రిముఖ పోటీ నెలకొంది. అప్పటికి గాజువాక ఓటర్ల సంఖ్య 3,09,326కు పెరిగింది. త్రిముఖ పోటీ నెలకొన్న ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 65.33 శాతం నమోదైంది.

కాగా, ఈసారి గాజువాక ఓటర్ల సంఖ్య అనూహ్యంగా 3,33,611కు పెరగడంతో పాటు యువ ఓటర్ల సంఖ్య కూడా 70వేలు దాటినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే, ఇది ఎంత శాతం పెరుగుందనే విషయాన్ని మాత్రం అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది.

ఓటు కోసం ఆందోళన వద్దు

- ఓటు వేసేందుకు స్లిప్పులు అందని ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. స్లిప్పులు అందనివారు సహాయ కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా వివరాలను పొంది ఓటు వేయవచ్చు.
- ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని వారు అందజేస్తారు.
- వికలాంగులకు ర్యాంపులు పెట్టి ట్రైసైకిళ్లను ఏర్పాటు చేశారు. అంధులకు బ్రెయిలీ లిపిలో బ్యాలెట్ షీట్ అందుబాటులో ఉంచారు.
- ఓటరు జాబితాలో పేరు ఉండి కార్డు లేకపోయినా ఓటు వేయవచ్చు. ఓటరు తనకు సంబంధించిన ఏదో ఒక ప్రూఫ్‌ను పోలింగ్ కేంద్రంలో చూపించాలి. ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్ తదితర ఆధారాలను చూపించవచ్చు.

ప్రగతి సంతకం

ఐదేళ్లలో గణనీయ అభివృద్ధి

ఫోకస్

అభివృద్ధి ఏ ఒక్క అంశానికో, ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకూడదు. ప్రతీ చోట ప్రగతి పరవళ్లు తొక్కాలి. ప్రతీ కుటుంబంలో సంక్షేమ కాంతులు వెల్లివిరియాలి. ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థి ఉన్నత చదువులు చదవాలి. ఏ ఒక్క నిరుపేదకు వైద్యం అందని పరిస్థితి ఉండకూడదు. ప్రతీ ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందాలి. రహదారులు ప్రగతి మార్గాలు కావాలి.. ప్రజలకు పాలన చేరువ కావాలి.. మహిళా సాధికారత ప్రతిఫలించాలి. ఇదంతా సాధ్యమేనా అనే ప్రశ్నే లేకుండా ఐదేళ్ల పాలనలో ఇవన్నీ కళ్లముందు సాక్షాత్కరింపజేశారు. ఫలితంగా ప్రతీ ఇల్లు ఆనందాల పొదరిల్లులా మారింది. అంతటా అభివృద్ధి వెలుగురేఖలు ప్రసరించాయి. నిదర్శనమిదీ..

– అక్కిరెడ్డిపాలెం/గాజువాక/పెదగంట్యాడ



పాత గాజువాక జంక్షన్ (విస్తరణకు ముందు)



రూ.కోటితో విస్తరించిన పాతగాజువాక జంక్షన్



గాజువాక పీహెచ్‌సీ పాత భవనం



రూ.1.10 కోట్లతో నిర్మించిన గాజువాక పీహెచ్‌సీ భవనం



68వ వార్డు అక్కిరెడ్డిపాలెం చర్చి వద్ద శిథిలమైన కల్వర్టు



అక్కిరెడ్డిపాలెం చర్చి వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టు



68వ వార్డులోని అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక పరిస్థితి



రూ.1.50 కోట్లతో నిర్మించిన అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటిక



అక్కిరెడ్డిపాలెంలో అస్తవ్యస్తంగా ధోబీ ఖానా



నూతనంగా నిర్మించిన ధోబీ ఖానా